


- జాప్యంతో నిరాశలో ఉపాధ్యాయులు
- కనీసం మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్లు చేపట్టని వైనం
- విద్యాశాఖ నిర్ణయం కోసం టీచర్ల ఎదురుచూపు

# స్పౌజ్ బదిలీలు ఎప్పుడో?

హనుమకొండ చౌరస్తా, జనవరి 7: స్పౌజ్ బదిలీల్లో జాప్యం కారణంగా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల్లో నిరాశ నెలకొంది. జీవో 317 అమలులో భాగంగా భార్యాభర్తలైన ఉపాధ్యాయులను వేర్వేరు జిల్లాలు, జోన్లకు కేటాయించి మూడేళ్లు గడిచింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్పౌజ్ బదిలీలు పూర్తి చేస్తామన్న హామీ అమలు కోసం ఉపాధ్యాయులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయులు ఇల్లు, పిల్లలు, వృద్ధులైన అత్తమామలు, తల్లిదండ్రులను వదిలి సుదూర ప్రాంతాలకు ప్రయాణం చేయలేక శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ ముగిసిన తర్వాత ఏర్పడిన ఖాళీలను 13 జిల్లాల్లోని ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టి భర్తీ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. 317 జీవోతో స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేసే ఉద్దేశంతో మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేయడంతోపాటు 2001 జనవరిలో దరఖాస్తు చేసుకున్న స్పౌజ్ ఉపాధ్యాయులను కూడా మరలా అప్లై చేసుకోవాలని సూచించడంతో కథ మళ్లీ మొదటికి వచ్చి ఏడాదిగా ఎదురుచూపులు తప్పలేదు. చివరికి మంత్రివర్గం స్పౌజ్, మెడికల్ బదిలీలకు సానుకూలత వ్యక్తం చేసింది. తదుపరి జీవో 243 ప్రకారం స్పౌజ్ బదిలీల ప్రక్రియ ప్రారంభించి డిసెంబర్ మాసాంతానికి పూర్తి చేస్తామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శాసనమండలిలో ప్రకటించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వివిధ శాఖల్లో స్పౌజ్, మెడికల్ బదిలీల ప్రక్రియ స్థితిని జనవరి 4లోగా తెలపాలని జారీ చేసిన నోట్‌కు కాలపరిమితి మించిపోయింది. దీంతో స్పౌజ్ బదిలీలు ఏ కారణం చేత ఆగిపోయాయో తెలియక ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఒకవేళ స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైతే తమ బదిలీలు ఎక్కడ ఆగుతాయోనని ఆవేదన చెందుతున్నారు. ఇదివరకే ప్రమోషన్లు అనంతరం చేపట్టాల్సిన ఈ బదిలీల ప్రక్రియ కొత్త ఉపాధ్యాయుల నియామకం కారణంగా ఆగిపోయింది. జనవరి 10లోగానైనా బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వానికి విన్నవించుకుంటున్నారు. స్పౌజ్ బదిలీ జరగని పక్షంలో కనీసం మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్లకు అవకాశం ఉంటుందనుకుంటే అధికారులు ఎలాంటి నిర్ణయాన్ని ప్రకటించకపోవడంతో ఉపాధ్యాయులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) అంచనా తప్పింది. ఓ సిటీ ప్లాట్ల వేలంతో నిధులు మూటగట్టుకోవాలనుకున్న అత్యాశకు చెక్ పడింది. 13వ విడత ప్లాట్ల వేలంపై కొనుగోలుదారులు ఆసక్తి చూపకపోవడంతో బొక్కబోర్లా పడింది. 12 విడతల్లో భారీగా ఆదాయం సమకూర్చుకున్న కుడా.. ఈ దఫా అదే లెక్కతో ముందుకెళ్లింది. హనుమకొండ, వరంగల్ ప్రాంతంలో ఎక్కడా లేని విధంగా అధిక ధరలు నిర్ణయించి ఈ నెల 5న ప్లాట్ల వేలానికి పూనుకుంది. అయితే కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో నిరాశకు గురైంది. చేసేదేమీలేక అధికారులు వేలాన్ని వాయిదా వేయాల్సి వచ్చింది. ప్లాట్ల వేలానికి ముందు అరచేతిలో స్వర్గాన్ని చూపెట్టడం.. ఆ తర్వాత అటువైపు కన్నెత్తి చూడకపోవడమే ప్రజల అనాసక్తికి కారణంగా తేలింది. గేటెడ్ కమ్యూనిటీ కాలనీ అభివృద్ధి చేస్తామన్న హామీని నిలబెట్టుకోలేక పోయింది. కాలనీలో తిష్టవేసిన సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపకపోవడం, కొత్త చైర్మన్ సందర్శించకపోవడం ప్రజలకు ఆగ్రహాన్ని తెప్పించింది. ఫలితంగా భారీగా నిధులు రాబట్టుకోవాలనుకున్న కుడా అంచనా తారుమారైంది. - వరంగల్, జనవరి 7

### సమస్యల తిష్ట

గేటెడ్ కమ్యూనిటీగా చెప్పుకుంటున్న ఓ సిటీలో సమస్యలు తిష్ట వేశాయి. కనీస సౌకర్యాలు కల్పించకుండా కుడా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అక్కడ నివాసం ఉంటున్న వారు ఆరోపిస్తున్నారు. చుట్టూ ప్రహరీ లేకపోవడంతో రాత్రి సమయం లో ఆ ప్రాంతం మందు బాబులకు అడ్డాగా మారుతున్నది. యథేచ్ఛగా పందులు, కుక్కలు తిరుగుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. సీసీ కెమెరాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని, ఇందులో సగం కూడా పని చేయడం లేదని అంటున్నారు. సెంట్రల్ లైటింగ్ పనిచేయకున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇటీవల కుడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఇనుగాల వెంకట్రామిరెడ్డి ఓ సిటీ వైపు కన్నెత్తి చూడలేదని, సమస్యలపై దృష్టి పెట్టలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుడా ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందించిన ఓ సిటీ అభివృద్ధిని పట్టించుకోకపోవడంపై మండిపడుతున్నారు.




# లెక్క తప్పింది..

**ఓ సిటీ ప్లాట్ల వేలంపై కుడా అంచనాలు తారుమారు**

- 13వ విడతలో కొనుగోలుకు ఆసక్తి చూపని ప్రజలు
- వేలాన్ని వాయిదా వేసి వెనుదిరిగిన అధికారులు
- అధిక ధరలు.. హామీలు నెరవేర్చకపోవడమే ఇందుకు కారణం
- గేటెడ్ కమ్యూనిటీ కాలనీ నిండా సమస్యల తిష్ట
- పరిష్కరించడం లేదంటూ స్థానికుల ఆగ్రహం
- చైర్మన్ రాకపోవడంపై మండిపాటు

రెండు దశాబ్దాల క్రితం అజాంజాహి మిల్లుకు సంబంధించి 120 ఎకరాల భూమిని నేషనల్ టెక్స్‌టైల్ కార్పొరేషన్ నుంచి కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) కొనుగోలు చేసింది. వరంగల్ నగరంలో గేటెడ్ కమ్యూనిటీ కాలనీ ఏర్పాటు చేస్తామని విస్తృత ప్రచారం కల్పించడంతో అధిక ధరలున్నా ఓ సిటీలోని ప్లాట్లు హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. 12 విడతల్లోనూ ఇలాగే ప్రచారం చేసి ప్లాట్లు విక్రయించిన కుడా భారీగా నిధులు సమకూర్చుకుంది. ఈ నెల 5న ఓ సిటీ ప్రాంగణంలో 13వ విడత వేలం పాటల్లో 40 రెసిడెన్స్ ప్లాట్లకు వేలం నిర్వహించేందుకు నిర్ణయించింది. వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో ఎక్కడా లేని విధంగా నార్త్ ఈస్ట్ ప్లాట్లకు గజానికి రూ.75 వేలు, మిగతా వాటికి రూ. 70 వేలు, రోడ్డు వైపున్న కమర్షియల్ ప్లాట్లకు రూ. లక్ష ధర నిర్ణయించడంతో కొనుగోలుదారులకు గుండె ఆగినంత పనైంది. దీంతో వేలం పాటలు మొదలైనా ఎవరూ కొనేందుకు ముందుకు రాలేదు. మధ్యాహ్నం వరకు కేవలం 11 మంది మాత్రమే టోకెన్లు తీసుకోవడంతో అధికారులు వేలాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించి అక్కడి నుంచి వెళ్లిపోయారు.


కుడా కార్యాలయం

### మాట నిలుపుకోని కుడా

గేటెడ్ కమ్యూనిటీ కాలనీగా ఓ సిటీని అభివృద్ధి చేస్తామని చెప్పిన కుడా అధికారులు మాట నిలుపుకోలేక పోయారు. చుట్టూ ప్రహరీ నిర్మించి పూర్తి స్థాయిలో భద్రత కల్పిస్తామన్న హామీని విస్మరించారు. వేలం సందర్భంగా అప్పటి ఎస్పీని తీసుకొచ్చి ఓ సిటీలో పోలీసు ఔట్ పోస్ట్ ఏర్పాటు చేయిస్తామని చెప్పించారు. దీంతో వరంగల్ నగరంలో తొలి గేటెడ్ కమ్యూనిటీ కాలనీగా మారుతుందన్న ఆశతో అనేక మంది ప్లాట్లు కొనుగోలు చేసి రూ. కోట్లతో ఇళ్లు నిర్మించుకున్నారు. ప్లాట్లు విక్రయాలతో వందల కోట్లు సంపాదించుకున్న కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ మాత్రం ఇచ్చిన హామీలను నెరవేర్చలేదనే విమర్శలను మీదేసుకుంది.

- ఇచ్చిన మాటను దాటవేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి
- వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్
- గొంతుపై కత్తి పెట్టుకొని దివ్యాంగుల నిరసన


వరంగల్ జిల్లా ఉప్పరపల్లిలో గొంతుపై కత్తి పెట్టుకొని నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

# దివ్యాంగుల గొంతు కోసిన రాష్ట్ర ప్రభుత్వం

వర్ధన్నపేట, జనవరి 7: అధికారంలోకి రాగానే దివ్యాంగుల సంక్షేమ శాఖను మహిళా సంక్షేమశాఖ నుంచి వేరు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి మాట దాటవేస్తూ దివ్యాంగుల గొంతు కోస్తున్నాడని వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ ఆరోపించారు. వికలాంగుల శాఖను ప్రత్యేకంగా ఏర్పాటు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేయడాన్ని నిరసిస్తూ దివ్యాంగులు వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ఉప్పరపల్లిలో గొంతులపై కత్తులు పెట్టుకొని కోసుకుంటామని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజేశ్ మాట్లాడుతూ ఎన్నికల్లో వికలాంగుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను మర్చిపోయి వికలాంగులకు తీరని అన్యాయం చేస్తున్నారని అన్నారు. ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయడం లేదని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా వెంటనే దివ్యాంగులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ నాయకులు ఎండీ షరీఫ్, ఈదయ్య, బాబు, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

### సంబురాల్లో రైతులు

లిఫ్ట్ పనులు ప్రారంభించడంపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు, మహిళలు, యువకులు భారీగా తరలిరావడంతో పండుగ వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యే పల్లా ప్రత్యేక దృష్టి సారించడంపై అభినందనలు తెలియజేసి రైతులు.. బీఆర్‌ఎస్‌కు, ఎమ్మెల్యే పల్లాకు జీవితాంతం రుణపడి ఉంటామని చెబుతున్నారు. ఈ సందర్భంగా రైతులు, బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే పల్లా నృత్యం చేసి సంబురాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పింగిళి జగన్‌మోహన్‌రెడ్డి, జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, అధికార ప్రతినిధి చిలువేరు లింగం, గ్రామశాఖ అధ్యక్షులు అంకం రాజారాం, మాజీ జిల్లా అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి, నాయకులు గద్దల నర్సింగరావు, తేజావత్ గోవర్ధన్, ముద్దసాని పద్మజ, వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జొన్నగాని హరిత సుదర్శన్‌గౌడ్, గౌస్, పెద్ది రాజిరెడ్డి, వంగ రామారాజు, జూంలాల్‌నాయక్, సంజీవ, రాజు, సతీష్, సుధీర్,కుమార్, చందు నాయక్, బుచ్చిరాజు, పోశయ్య, ప్రభుదాసు పాల్గొన్నారు.


రైతులు, బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే పల్లా

# సాగునీటి ప్రాజెక్టులకు అడ్డుపడితే ఊరుకోం

- రాష్ట్రాన్ని అన్నపూర్ణగా మార్చిన ఘనత కేసీఆర్‌దే
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- తరిగొప్పులలో మినీ లిఫ్టు పనుల ప్రారంభం

తరిగొప్పుల, జనవరి 7 : రైతాంగానికి ఎంతో దోహదపడే సాగునీటి ప్రాజెక్టులకు అడ్డుపడితే ఊరుకునే ప్రసక్తే లేదని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తరిగొప్పుల మండలకేంద్రంలో దేవాదుల మినీ ఎత్తిపోతల పథ కం పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రాన్ని అన్నపూర్ణగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. వ్యవసాయరంగంలో దేశంలోనే తెలంగాణను అగ్రగామిగా నిలిపింది కేసీఆరేనని అన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో రైతులు వ్యవసాయాన్ని పండుగలా చేసుకున్నారని అన్నారు. ప్రజల ఆశీర్వాదంతోనే తాను ఎమ్మెల్యే అయ్యాయని, వారి రుణం తీర్చుకుంటానని పేర్కొన్న పల్లా.. అధికారం ఉన్నా లేకున్నా అభివృద్ధికి పాటుపడతానని చెప్పారు. తరిగొప్పుల మండలంలోని 52 చెరువులకు సాగు నీరు అందించేందుకు మొదటి లిఫ్ట్ పనులను పునః ప్రారంభించామని, 15 గ్రామాల్లోని ప్రతి చెరువులోకి రెండు పంటలకు కావాల్సిన నీళ్లు వస్తాయని చెప్పారు. రైతులు జీవితకాలం తమ వ్యవసాయాన్ని ఒక పండుగలా చేసుకునే భాగ్యం కలిగిందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ కృషి, అధికారుల సహకారంతో రూ.104 కోట్లు లిఫ్టు ఇరిగేషన్ సిస్టర్న్ మంజూరైందని తెలిపారు. మండలం నుంచి పరిసర ప్రాంతాల్లోని 80 శాతం భూభాగానికి నీరందించేలా పనులు కొనసాగుతున్నాయని అన్నారు. సిస్టర్న్ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా కృషి చేస్తామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఏడాదికి రెండు సార్లు రైతుబంధు అందిందని, ఇచ్చిన మాట నిలుపుకొన్న మహానేత కేసీఆర్ అని గుర్తుచేశారు. అయితే మార్పు అనగానే ప్రజలు ఉత్సాహంగా కాంగ్రెస్‌కు ఓట్లేశారని, కాని ఏడాది గడవక ముందే, ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిందన్నారు. అన్ని రంగాల్లో రేవంత్ ప్రభుత్వం విఫలమైందన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు ప్రతి గడపకు అందాయని, ముఖ్యంగా సాగు, తాగునీటి రంగాల అభివృద్ధికి కేసీఆర్ చేసిన కృషి ప్రశంసనీయమని అన్నారు. ప్రజలు, రైతులు ఇప్పటికీ కేసీఆర్‌నే గుర్తు చేసుకుంటున్నారని చెప్పారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాజీ మంత్రి కేటీఆర్‌పై కుట్రపూరితంగా కేసులు పెట్టాలని ప్రయత్నాలు చేస్తున్నదని ఎమ్మెల్యే పల్లా మండిపడ్డారు.


తరిగొప్పులలో కొబ్బరికాయ కొట్టి మినీ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

# కేసీఆర్ వల్లే రూ.104 కోట్లు మంజూరు

- స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే రాజయ్య
- బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని మాట్లాడడం సిగ్గుచేటు
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి వ్యాఖ్యలపై మండిపాటు

స్టేషన్ ఘన్‌పూర్, జనవరి 7: నియోజకవర్గంలోని ఎగువ ప్రాంతాల్లో సైతం సాగు నీటి సమస్యను పరిష్కరించేందుకు గత ప్రభుత్వంలో కేసీఆర్ రూ.104 కోట్లు మంజూరు చేశారని స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం చిల్పూర్ మండలంలో మినీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి.. సాగునీటి సమస్యను బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని మాట్లాడడం సిగ్గుచేటని పేర్కొన్నారు. నియోజకవర్గంలో సాగు, తాగు నీటి సమస్య ఉండొద్దనే లక్ష్యంతో రూ.104 కోట్లతో తరిగొప్పుల, చిల్పూర్, ధర్మసాగర్ మండలాలకు మూడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులను మంజూరు చేయడంతో పాటు నిధులు కూడా విడుదల చేశారన్నారు. వాటినే నేడు ఎమ్మెల్యే ప్రారంభిస్తూ గత సర్కార్‌ను విమర్శించడం సరికాదన్నారు. కేసీఆర్ పాలనలోనే రైతు బంధు, రైతు బీమా సకాలంలో చెల్లించారని, మిషన్ కాకతీయ ద్వారా చెరువులు, కుంటలను అభివృద్ధి చేయడంతో తెలంగాణలో భూగర్భ జలాలు పెరిగాయని, రైతుల కోసం చేపట్టిన పనులను ఐక్యరాజ్య సమితి అభినందించడంతో పాటు ఇతర దేశాలు సైతం మెచ్చుకున్నాయన్నారు. తన కూతురుకు ఎంపీ టికెట్ కోసం ఈ నియోజకవర్గాన్ని సీఎం రేవంత్‌రెడ్డి వద్ద కడియం కుదవపెట్టారని రాజయ్య విమర్శించారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల గణేశ్, కుడా మాజీ డైరెక్టర్ ఆకుల కుమార్, మాజీ సర్పంచ్‌లు తాటికొండ సురేశ్, కర్ర సోమిరెడ్డి, మార్కెట్ మాజీ డైరెక్టర్ చందర్‌రెడ్డి, కనకం గణేశ్, రాజన్‌బాబు, హీరాసింగ్, గుర్రం శంకర్, మాతంగి దేవయ్య, మారపల్లి ప్రసాద్, ఆకారపు అశోక్, గుండె మల్లేశ్, గోవిందు అశోక్, చింత శ్రీను పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

- శాశ్వత పనులను నాణ్యతతో చేపట్టాలి
- భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి
- సమీక్ష సమావేశంలో మంత్రి సీతక్క


సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

# మినీ మేడారం జాతరను విజయవంతం చేయాలి

ములుగు, జనవరి 7(నమస్తే తెలంగాణ) : వచ్చే నెల 12నుంచి 15వరకు జరిగే మినీ మేడారం జాతరను విజయవంతం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. మంగళవారం ములుగు జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కలెక్టర్ టీఎస్ దివాకర అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పని చేసి భక్తులకు ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. జాతర అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని, ప్రతి పనినీ నాణ్యతతో చేసి శాశ్వతంగా నిలిచిపోయేలా చూడాలని చెప్పారు. మహాజాతర సందర్భంగా జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా చూడాలన్నారు. 15 రోజుల నుంచి భక్తుల రాక పెరిగిందని, ఫిబ్రవరి మొదటివారం నుంచే భక్తుల తాకిడి అధికం కానున్నందున అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జాతరకు వచ్చే అన్ని లింకు రోడ్లను జనవరి 31లోగా పూర్తి చేయాలన్నారు. తల్లులను దర్శించుకునే సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన వసతులను కల్పించాలన్నారు. అధికారులు సమర్పించిన అభివృద్ధి పనుల అంచనాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవసరమైన నిధులను మంజూరు చేయిస్తానని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. జాతర విజయవంతానికి జిల్లా యంత్రాంగంతో పాటు ఐటీడీఏ అధికారులు కృషిచేయాలని కోరారు. సమావేశంలో ఎస్పీ పి.శబరీష్, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్, డీఎస్పీ రవీందర్, మేడారం ఆలయ ఈవో రాజేంద్రం, డీపీవో ఒంటేరు దేవరాజు, డీపీఆర్వో ఎండీ రఫీక్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో చేరనన్నందుకు కక్ష

- అద్దె చెల్లించకుండా మైనార్టీ పాఠశాల భవనం ఖాళీ
- ఫర్నిచర్ తరలింపును అడ్డుకున్న యజమాని, కుటుంబసభ్యులు
- అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించిన పోలీసులు


నిరసన తెలుపుతున్న యజమాని దేవేందర్‌రెడ్డి, కుటుంబ సభ్యులను అడ్డుకుంటున్న పోలీసులు


కుటుంబ సభ్యులను పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

కృష్ణకాలనీ, జనవరి 7: అధికార పార్టీకి చెందిన ఓ నియోజకవర్గస్థాయి ప్రజాప్రతినిధి తనను కాంగ్రెస్ పార్టీలోకి రమ్మంటే తాను పోనందుకు తనపై కక్ష పెంచుకొని జిల్లా అధికారులతో కలిసి ప్రభుత్వ మైనార్టీ పాఠశాల భవనాన్ని ఖాళీ చేయిస్తున్నాడని భవన యాజమాని నాగుల దేవేందర్ రెడ్డి ఆరోపించారు. తనకు రూ.40 లక్షల వరకు అద్దె రావాలని, అది చెల్లించిన తర్వాతే భవనం ఖాళీ చేయాలని దేవేందర్‌రెడ్డి కుటుంబంతో సహా నిరసన తెలిపి, పాఠశాల ఫర్నిచర్‌ను వ్యానులో తరలిస్తుండగా అడ్డుకున్నారు. దీంతో వారిని పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ 2021లో జిల్లా అధికారుల కోరిక మేరకు తన భవనాన్ని తెలంగాణ ప్రభుత్వ మైనార్టీ పాఠశాలకు అద్దెకు ఇచ్చానన్నారు. 2027 వరకు లీగల్ అగ్రిమెంట్ ఉందని, అయినప్పటికీ అధికార పార్టీకి చెందిన కొంతమంది ప్రజాప్రతినిధులు తన పైన కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ కావాలనే భవనాన్ని ఖాళీ చేయిస్తున్నారని తెలిపారు. అయినప్పటికీ తాను ఏమీ అనలేదని, తనకు రూ. 40 లక్షల వరకు అద్దె రావాలని, ఆ తర్వాతనే భవనాన్ని ఖాళీ చేయాలని వేడుకున్నానన్నారు. మైనార్టీ స్కూల్ ప్రిన్సిపాల్, జిల్లా మైనార్టీ శాఖ అధికారి, సంబంధిత శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి లిఖితపూర్వకంగా లేఖ కూడా ఇచ్చానని, డీఎండబ్ల్యూవో శైలజ పూర్తి అద్దె చెల్లించిన తర్వాతనే భవనాన్ని ఖాళీ చేస్తామని హామీ కూడా ఇచ్చారన్నారు. కానీ తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే మంగళవారం భవనాన్ని ఖాళీ చేయించారన్నారు. తాను రూ. 10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఖర్చు చేసి భవనాన్ని సుందరంగా తయారు చేసి ప్రభుత్వ మైనార్టీ పాఠశాలకు అప్పజెప్పానన్నారు. తన అద్దె చెల్లించమని వేడుకుంటే క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని బెదిరిస్తున్నారన్నారు. ఈ విషయంపై డీఎండబ్ల్యూవో శైలజ మాట్లాడుతూ నాగుల దేవేందర్ రెడ్డి భవనానికి అద్దె చెల్లించాల్సిన మాట వాస్తవమేనన్నారు. విడతల వారీగా చెల్లిస్తామని, వీలైనంత త్వరలోనే అద్దె చెల్లించేందుకు సంబంధిత శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి సమాచారం అందిస్తామని చెప్పారు.